క్లుప్తంగా

మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి



జగనన్న కాలనీలో పరిశీలిస్తున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము పేర్కొన్నారు. బుధవారం ఆయన ఇక్కడ పర్యటించారు. ఈ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. త్వరలో వీధి లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు శానిటరీ సూపర్‌వైజర్లు బడే అమ్మోరు, పైడిరాజు, హేమ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుకు కృషి చేయాలి

తగరపువలస: స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుకు జీవీఎంసీ చిత్తశుద్ధితో కృషి చేయాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి పిట్టా సురేష్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో తగరపువలస మెయిన్‌రోడ్డు మురుగు, చెత్తతో నిండిపోతుందన్నారు. ఇరువైపులా వ్యాపారులు డ్రైనేజీలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం ఒక కారణమయితే, వ్యాపారుల నుంచి చెత్త సేకరించకపోవడం మరో కారణమన్నారు. చిన్నపాటి వర్షాలకే ప్రధాన రహదారులు, జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న సర్వీస్ రోడ్లు మురుగునీటితో నిండిపోతున్నాయన్నారు. వీటిపై అధికారులు దృష్టి సారించాలని ఆయన కోరారు.

ఓటర్ల జాబితా సవరణపై నేడు సమావేశం

తగరపువలస: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ – 2023పై నియోజకవర్గంలోని వివిధ పార్టీల ప్రతినిధులతో గురువారం ఉదయం 10 గంటలకు భీమిలి ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. పోలింగ్ బూత్‌ల మార్పు, ఓటర్ల జాబితా సవరణ, ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటా సర్వే తదితర విషయాలపై చర్చించేందుకు బూత్ లెవెల్ ఏజెంట్లు జాబితాతో సమావేశానికి హాజరుకావాలని ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి కోరారు. సమావేశానికి వివిధ పార్టీల అధ్యక్షులు, లేదా వారి ప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి

ఆనందపురం: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని ఆనందపురం సీఐ రామచంద్రరావు సూచించారు. స్థానిక రవీంద్రభారతి గ్లోబల్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన పెట్టుబడి వేడుక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చరిత్రలో జరిగిన సంఘటనలు, ఆనాటి నాయకుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పుస్తకాల ద్వారా సంపాదించే జ్ఞానంతో నిజ జీవితంలో గొప్ప వ్యక్తులుగా ఎదగాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం నేడు

తగరపువలస: భీమిలి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తామని ఎంపీడీవో పి.వెంకటరమణ తెలిపారు. మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొమ్మాది: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని వాసవ్య మహిళా మండలి సంఘ సేవకర్త ప్రసన్న లక్ష్మి అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు రుషికొండలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలు, మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. తక్కువ ధరలో లభించే రాగుల్లో ఎన్నో అద్భుత గుణాలున్నాయని, వాటిని నిత్య ఆహారంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండలి సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్లపై విద్వేష వ్యాఖ్యలు దారుణం

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై పోటీ చేసిన వారికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



రామవరంలో మహిళకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నాయకులు



చిప్పాదలో ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ వాసురాజు

తగరపువలస: ఈ నాలుగున్నరేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై పోటీచేసిన టీడీపీ వారికి కూడా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన మంచి మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం చిప్పాడలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో అర్హులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఆరుసార్లు ఇంటింటా సాధికార సర్వే, వైద్య పరీక్షలు, చికిత్స, మందులు, రూ.వెయ్యి పంపిణీ చేపట్టిన వలంటీర్లపై చంద్రబాబు, పవన్ విద్వేషంతో రగిలిపోతూ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. వలంటీర్ వ్యవస్థను కర్ణాటక, సచివాలయ వ్యవస్థను తమిళనాడు, ఇంటింటా రేషన్ పంపిణీని పంజాబ్ వంటి రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని... అలాంటిది అభివృద్ధి చెందుతున్న భారతదేశంలోని మన రాష్ట్రంలో ఇలాంటి పథకాలు అందుతున్నాయంటే జగనన్న ముందు చూపే కారణమన్నారు. పంచాయతీలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం ఒక్కో కుటుంబానికి సగటున రూ.3.25 లక్షలు వంతున ప్రభుత్వం అందించిందన్నారు. పేదల కోసమే పుట్టినట్టు జగన్ లాంటి నాయకుడు ప్రపంచంలో మరొకరు పుట్టరన్నారు. అధికారులంతా జగన్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో మంచి పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో భీమిలి ఎంపీడీవో ఎం.వెంకటరమణ, వ్యవసాయ శాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ వెంపాడ రమావతి, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమ్మిడి శ్రీనివాసరావు, కాద సూర్యనారాయణ, చెల్లూరి నగేష్, పాట్నూరు చంద్రశేఖర్, వెంపాడ సూరిబాబు, మేరుగు ఎల్లాజీ, తుపాకుల అప్పలరాజు, మద్దిల వెంకటరమణ, పల్లా సన్యాసిరావు, తోట ఎల్లారావు, సరగడ రాంబాబు, చిల్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం మండలంలో...

మండలంలోని రామవరం, శొంఠ్యాం పంచాయతీల్లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడారు. రామవరం పంచాయతీలో రూ.25 కోట్లు, శొంఠ్యాంలో రూ.22 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. అనంతరం రామవరంలో విలేజ్ క్లినిక్, శొంఠ్యాంలో పీహెచ్‌సీని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకవరపు రామారావు, ఎంపీడీవో ఎ.లవరాజు, కాకర్లపూడి శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, కోరాడ మునలినాయుడు, రౌతు శ్రీను, లెంక రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు గొలగాని కృష్ణ, పల్ల దుర్గ, కోరాడ వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలతో ప్రమాదాల నివారణ



పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: పరిశ్రమల నిర్వహణ విషయంలో భద్రతా ప్రమాణాలు సక్రమంగా పాటిస్తే ప్రమాదాలు జరగవని ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. స్థానిక పరిశ్రమల ప్రతినిధులతో కర్మాగారాల తనిఖీశాఖ ఆధ్వర్యంలో బుధవారం తమ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల భద్రతకు కూడా పరిశ్రమల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు ఏవిధంగా జరుగుతాయో అంచనా వేసుకుని, జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమల్లో పనిచేసే వారందరికీ భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు జరిగే సమయాల్లో సురక్షితంగా ఎలా బయటపడాలన్న విషయాలపై మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకరరెడ్డి మాట్లాడుతూ అన్ని పరిశ్రమలను నిత్యం తనిఖీ చేయడంతోపాటు తగిన సూచనలు అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పైడి చిన్నారావు, అధికారులు పాల్గొన్నారు.

ఏయూలో మేకపాటి ధ్యాన, జ్ఞాన క్షేత్రం

- ప్రారంభమైన నిర్మాణ పనులు
- రూ.2 కోట్లు అందిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో మేకపాటి గౌతంరెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఈ క్షేత్రం నిర్మాణానికి సంబంధించి హనీ గ్రూప్‌తో మహాబోధి సొసైటీ అవగాహన ఒప్పందం చేసుకుంది. మహాబోధి సొసైటీ ప్రతినిధి ఆర్.విజయ్‌కుమార్, హనీ గ్రూప్ మేనేజింగ్ పార్ట్‌నర్ ఎం.ఓబుల్ రెడ్డి ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, మానవ అధ్యయన శాస్త్ర విభాగం ఆచార్యుడు పి.డి సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భవన నిర్మాణం, ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. ఇందు కోసం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి రూ.2 కోట్లను అందిస్తున్నారు. ఈ సందర్భంగా మహాబోధి సొసైటీ ప్రతినిధి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏయూ అందిస్తున్న సహకారం, మేకపాటి రాజమోహన్‌రెడ్డి సౌజన్యంతో విశాఖ ప్రజలకు ఉపయుక్తంగా మేకపాటి గౌతంరెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత, సమాజంలో శాంతిని పెంచే విధంగా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

మధురవాడ: విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకుని చక్కగా చదివి శత శాతం ఉత్తీర్ణత సాధించాలని ఓక్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ అయ్యగారి మార్తాండమ్ సూచించారు.

మధురవాడ వాంబేకాలనీలోని సునీల్‌శర్మ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. మంచి మార్కులు సాధించడానికి, సులువుగా పాఠాలు అర్థం చేసుకోవడానికి మెలకువలు నేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలు గతం కంటే బాగా అభివృద్ధి చేశారని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎమ్ జి.శాండిల్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధనలో మెలకువలు నేర్చుకోవాలి



ప్రధానోపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతికుమారి

తగరపువలస: ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు భీమిలి ఏఎంసీ కాలేజ్‌లో రెండో రోజైన బుధవారం శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులకు మూర్తిమత్వ అభివృద్ధిపై ఏపీహెచ్‌ఆర్డీకి చెందిన ఎస్వీఆర్ నాయుడు శిక్షణ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ఎస్.ప్రసాద్ శిక్షణ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. విద్యాబోధనలో వృత్తి పరమైన మెలకువలు నేర్చుకుని ప్రభుత్వ హైస్కూళ్లను అభివృద్ధి మార్గంలో నడిపించాలని సూచించారు. పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఎం.జ్యోతికుమారి, డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్రశిక్ష జిల్లా అదనపు పథక సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్.కల్పన, డిప్యూటీ డీఈవో ఎ.గౌరీశంకర్, ప్రొగ్రాం మేనేజర్ సత్తారు బాబూరావు, అసిస్టెంట్ అకడమిక్ మోనిటరింగ్ అధికారి జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ వై.సురేష్‌కుమార్ చెప్పారు. ఈ మేరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు కొమ్మాది విలేజ్, దేవిమెట్ట, కుక్కలు కంపెనీ లే అవుట్, ఓజోన్ వేలీ రోడ్, చైతన్య క్యాంపస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని సురేష్‌కుమార్ కోరారు.

'జగనన్న సురక్ష' నేడు

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహిస్తామని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ తెలిపారు. కొవ్వాడ, గంధవరం గ్రామాల్లో నిర్వహించే సభలకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

చిన్నారులు బడి బయట ఉండకూడదు

- డీఈవో చంద్రకళ



ఆనందపురం కాలనీలో విద్యార్థినికి జగనన్న విద్యా కానుక కిట్ అందిస్తున్న డీఈవో చంద్రకళ

ఆనందపురం: వివిధ కారణాలతో పాఠశాలలు మానేసిన చిన్నారులు బడి బయట ఉండకుండా తిరిగి పాఠశాలలకు చేర్చే బాధ్యత తల్లిదండ్రుల సాయంతో ఉపాధ్యాయులు తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. బుధవారం ఆమె ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. డ్రాపౌట్లుగా ఉన్న 10 మంది విద్యార్థులను గుర్తించి ఆనందపురం కాలనీ, బుడగజంగాల కాలనీ, పొడుగుపాలెం గ్రామాలను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవడమే కాకుండా తమ పిల్లలను పాఠశాలలకు పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు కూడా డ్రాపౌట్లు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా డ్రాపౌట్లకు జగనన్న విద్యాకానుక కిట్లు అందించారు. వారిని గురువారం నుంచి పాఠశాలలకు పంపించాల్సిందిగా తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పొడుగుపాలెం ఎంపీటీసీ సభ్యుడు బంటుపల్లి అప్పలస్వామి, ప్రధానోపాధ్యాయుడు పట్నాయక్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, అజయ్, భాస్కరరావు, శంకరరావు, మ్యాజిక్ బస్ ప్రతినిధులు దూడ రమేష్ రమణమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ పి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి సిగ్నల్ వ్యవస్థ



చంద్రంపాలెం హైస్కూలు వద్ద అందుబాటులోకి వచ్చిన సిగ్నల్ వ్యవస్థ

మధురవాడ: జాతీయ రహదారిపై చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో గత ఏడాది ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం సిగ్నల్స్ ఏర్పాటు చేసింది. కొద్ది రోజుల క్రితం చిప్ చెడిపోవడంతో ఈ సిగ్నల్స్ ఆగిపోయాయి. రోడ్డు దాటడానికి విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో అధికార యంత్రాంగం స్పందించి సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు.

విజయానందపురంలో రోడ్డు ప్రమాదం



ప్రమాద స్థలిలో ఆటో, కారు

పద్మనాభం: మండలంలోని విజయానందపురం జంక్షన్‌కు సమీపంలో బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ జంక్షన్‌లో ఆగి ఉన్న ఆటోను కారు ఢీకొట్టింది. దీంతో ఆ ఆటో రోడ్డు కిందకు బోల్తా పడింది. కారు రోడ్డు కిందకు ఒరిగిపోయింది. కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సీఐ ఎస్.సన్యాసినాయుడును వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సంక్షేమ పథకాలే సీఎం జగన్ పాలనకు గీటురాళ్లు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం: రాష్ట్రంలో విజయవంతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దేశంలోని పలు రాష్ట్రాల సీఎంలు ఆదర్శంగా తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సాయంత్రం జీవీఎంసీ ఆరో వార్డు పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలోని 48వ నంబరు సచివాలయం పరిధిలోని 11 క్లస్టర్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న ఇంటి వద్దకే నిత్యావసర సరకుల సరఫరాను పంజాబ్ రాష్ట్రంలోనూ అమలు చేయాలన్న తలంపుతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. మన వలంటీర్ వ్యవస్థను ఆదర్శంగా తీసుకుంటున్నట్లు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రకటించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రజలు జగన్ మోహన్ రెడ్డిని మరలా సీఎం స్థానంలో నిలపడానికి కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఈ నియోజకవర్గంలో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కాలనీలో వీధి లైట్ల సదుపాయం అంతంత మాత్రంగా ఉందని, స్థానికంగా పాకలలో నివసిస్తున్న వారికి ఆ స్థలాలనే ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని నివాసులు ఎమ్మెల్యేను కోరారు. కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, జెడ్సీ కనక మహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ 6, 7 వార్డుల అధ్యక్షులు బొట్టా అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, నాయకులు కె.వరలక్ష్మి, గాదె రోశిరెడ్డి, పోతిన ప్రసాద్, వాండ్రాసి రవి, పిల్లా సత్యనారాయణ, జామి శివకుమార్, సాయి కుమార్ పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సింహాచలం: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. జీవీఎంసీ 93వ వార్డు పరిధి నాయడుతోటలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆత్మకూరు యశోద సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ పరిశోధన కేంద్రాన్ని బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 2019 వరకు రాష్ట్రంలో కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలు మాత్రమే ఉండేవన్నారు. 2019 తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో కొత్తగా 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టామన్నారు. అందులో ఐదు కళాశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్లు కూడా ఇస్తున్నామన్నారు. దాంతో 750 సీట్లు కొత్తగా ఈ సంవత్సరం పెరుగుతున్నట్లు తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి వైఎస్సార్ కంటి వెలుగు, స్కూల్ పిల్లలకు కంటి పరీక్షలు చేయిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. గడిచిన 26 సంవత్సరాలుగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. శంకర్ ఫౌండేషన్ సేవలను గుర్తించి 2005లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నాయుడుతోటలో అత్యంత విలువైన రెండెకరాల ప్రభుత్వ భూమి కేటాయించారన్నారు. ఆ స్థలంలో యాజమాన్యం భారీ భవనాన్ని నిర్మించి, అన్ని సౌకర్యాలతో కంటి చికిత్సలు అందిస్తున్నారన్నారు. ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్ మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ ఆత్మకూరి శంకరరావు ఆశయాలకు అనుగుణంగా ట్రస్టీలు, డాక్టర్లు, ఉద్యోగులు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ అజయ్‌శర్మ, డాక్టర్ శిరీష, డీజీఎంలు కె.బంగార్రాజు, వి.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంఈవో–1గా రమణ బాధ్యతల స్వీకరణ

పద్మనాభం: మండల విద్యాశాఖ అధికారి–1గా పొన్న గంటి రమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు పద్మనాభం ఎంఈవో–1గా పనిచేసిన ఎం.శివరాణికి పదోన్నతి కల్పిస్తూ భీమునిపట్నం బదిలీ చేశారు. భీమునిపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమణకు పద్మనాభం మండల విద్యాశాఖ అధికారి–1గా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. దీంతో బాధ్యతలు స్వీకరించిన రమణకు ఉపాధ్యాయ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. బదిలీ అయిన శివరాణిని సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంఈవో–2 బాబులాల్, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



సుధాకర్ (ఫైల్)

పీఎం పాలెం: చదువుకు తగ్గ ఉద్యోగం లభించలేదని జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోరవానిపాలెంలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా కవిటి ప్రాంతానికి చెందిన కర్రి అప్పన్న సుధాకర్ (39) మధురవాడ సమీప బొట్టవానిపాలెం గ్రామంలో భార్య శారదతో నివసిస్తున్నాడు. వీరికి 2016లో వివాహం కాగా పిల్లలు లేరు. ఎంబీఏ పూర్తి చేసిన సుధాకర్ ఓ ప్రైవేటు కంపెనీలో రెండు సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన చదువుకు తగ్గ ఉద్యోగం కాదని వేరే ప్రయత్నాల్లో భాగంగా కొన్నాళ్లుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం తెల్లవారుజామున ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. ఉదయం లేచి చూసే ఉరికి వేలాడుతున్న భర్తను చూసి భార్య శారద స్థానికులకు తెలియజేసింది. దీనిపై అందిన సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

భూములు కోల్పోయిన రైతులకు ఇళ్లివ్వాలి

ఆరిలోవ: మధురవాడ ప్రాంతం కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాల్లో భూములు కోల్పోయిన దళిత, పేద రైతులకు తక్షణమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రెవెన్యూ అధికారులను సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ కోరారు. ఆయా గ్రామాల రైతులతో కలిసి సీపీఎం నాయకులు బుధవారం రూరల్ మండల కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు ఎస్.రమణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 88 మంది రైతులకు ఒక్కొక్కరికి వ్యవసాయం చేసుకోవడానికి ఎకరం చొప్పున భూములిచ్చారని గుర్తు చేశారు. కొన్నాళ్ల తర్వాత ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకుందన్నారు. ఆ భూముల్లో నవోదయా స్కూల్, పోలీస్ ట్రైనింగ్ కేంద్రం, వికలాంగుల ఐటీఐ, పట్టుపురుగుల అభివృద్ధి కేంద్రం, జూనియర్ కాలేజీ నిర్మించారన్నారు. ఇంతవరకు ఆ రైతులకు ప్రత్యామ్నాయం చూపలేదని, వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కుమార్ డిమాండ్ చేశారు.

డెంగ్యూ, మలేరియా కట్టడికి ప్రత్యేక కార్యాచరణ

మద్దిలపాలెం: డెంగ్యూ, మలేరియా జ్వరాల కట్టడికి సచివాలయాల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తున్నామని జిల్లా మలేరియా నివారణ విభాగం అధికారి తులసి తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఫీవర్‌సర్వే చేపట్టి వైద్య పరీక్షలు, వైద్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇసుకతోట, మధురవాడ, పీఎం పాలెం అర్బన్ హెల్త్ సెంటర్లను బుధవారం ఆమె సందర్శించారు. ఆయా హెల్త్ సెంటర్లలో డెంగ్యూ, మలేరియా నిర్ధారణకు చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఫీవర్ సర్వేలో వలంటీర్లు గుర్తించిన జ్వరపీడితులకు సచివాలయ ఏఎన్ఎంలు తక్షణ వైద్యపరీక్షలు చేసి, తగిన వైద్యం అందించాలని సూచించారు. వారు క్షేత్రస్థాయిలో పరీక్షలు చేస్తున్న విధానాన్ని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు పరిశీలించాలన్నారు. డెంగ్యూ ,మలేరియా కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనల్లో దోమల లార్వాను గుర్తించి, తొలగించాలన్నారు. డెంగ్యూ, మలేరియా జ్వరాలపై అవగాహన కల్పించి, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ రామినాయుడు పాల్గొన్నారు.

గాయపడిన గోవుకు చికిత్స



ఆవుకు ప్రథమ చికిత్స అందిస్తున్న వెటర్నరీ సిబ్బంది

మధురవాడ: ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన సంచార వైద్య వాహనాలు మనుషులకే కాదు ప్రమాదంలో గాయపడిన పశువులకు కూడా తక్షణ సేవలు అందిస్తున్నాయి. దీంతో ఈ సేవల పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మధురవాడ జాతీయ రహదారిపై రైతు బజార్ వద్ద గుర్తు తెలియని వాహనం ఒక గోవును ఢీకొట్టడంతో గాయపడింది. స్థానికులు సంచార పశువైద్య వాహనానికి సమాచారం అందించారు. వెంటనే వాహనంతో సిబ్బంది అక్కడకు చేరుకుని ఆవుకు ప్రథమ చికిత్స అందజేశారు.